# ఆడవాళ్లు క్షమిస్తారా?

'పాపం రాంబాబుగారికి ఇడ్లీలు పెట్టనేలేదా?'— ఇదే లలిత అన్నమాట. ఇదొక్కటే వాక్యం. ఆవేళ ఆదివారం. మధ్యాహ్నం యింటి కోడలు సావిత్రి పెసరట్లు పోస్తోంది. ఆడబడుచు లలిత, వాళ్ళాయన సుందరం కూర్చున్నారు. సుందరం తింటున్నాడు పెసరట్లు. లలిత ఆయనకి కావలసిన నెయ్యి, పచ్చడి వడ్డిస్తోంది. శేరు పెసలు రుబ్బగా పెద్ద గిన్నెడు పిండి అయింది. పదకొండు పెసరట్లు ఒకదాని తర్వాత ఒకటి సావిత్రి పోస్తోంటే, అతను వద్దనకుండా వేయించుకుని తిన్నాడు. పన్నెండవ పెసరట్టు కాలుతూండగా సావిత్రి వాళ్ళాయన, అంటే లలిత అన్నగారు, శ్రీపతి లోపలికి వచ్చాడు. బావమరిది భోజన పరాక్రమం అతనికి తెలియనిది కాదు. సావిత్రి ఓర్పూ అతనికి తెలిసినదే.

క్రిందటివారం ఇడ్లీలు వేసినప్పుడు మూడువాయలు, అంటే పదిహేను ఇడ్లీలు సుందరం భోంచేసినందువల్ల యింట్లో మిగిలినవాళ్ళకి, రాత్రి యజమాని వీర్రాజు ఫలహారానికి మాత్రమే సరిపోయాయి. రాంబాబు అంటే వీధి గదిలో

అద్దెకున్న గ్రాడ్యుయేటు కుర్రవాడు. అతను ఏదో ఆఫీసులో పనిచేస్తున్నాడు. చాల మొహమాటస్తుడు, ఇంట్లోకి బావి దగ్గరకు స్నానానికి మాత్రం వస్తుంటాడు. తలవంచుకుని అల్లాగే వెళ్ళిపోతుంటాడు. ఏదైనా టిఫిను, పిండివంట చేసు కుంటే సావిత్రి పురమాయింపు పైన శ్రీపతి అతనికి పెడుతుం టాడు. 'ఒక్కసారి లోపలికి రండి మాస్టారూ!' అంటూ యింట్లోకి పిలిచి పెడతాడు. క్రిందటివారం ఇడ్లీలు అతనికి మిగల్లేదు. ఈ వారం పెసరట్లు కూడా మిగలవేమోనని శ్రీపతి, 'సావిత్రీ! పెసరట్టు పోస్తున్నావా? చూడు, రెండు రాంబాబు కోసం ఉండేలాగు చూడు. క్రిందటివారం ఇడ్లీలు పెట్టనేలేదు' అన్నాడు.

దానిమీద లలిత చటుక్కున "పాపం రాంబాబుగారికి యిడ్లీలు పెట్టనేలేదా?" అన్నది. అదొక్కటే వాక్యం ఆమె అన్నది. పెద్ద చప్పుడైతే వెనక్కి తిరిగి చూసింది సావిత్రి. టేబిలు మీదనుంచి సుందరం ప్లేటు క్రింద పడే శాడు. "అదేమిటి, అల్లా త్రోసేశారు?" అన్నది. "నాకింక అక్కర్లేదండీ" అంటూ మంచినీళ్ళగ్లాసు పుచ్చుకుని చరచర అవతలికి వెళ్ళిపోయాడు సుందరం. అతని ముఖంలోని కోపం సావిత్రికి కొత్తకాదు. తలవంచుకుని ఖిన్నంగా లలిత కూర్చోవడం చూసి ఏంజరిగిందో గ్రహించిందామె. శ్రీపతి బావమరిదిని ఏమీ అనలేక, ఒక్కక్షణం నిలబడి అవతలికి వెళ్ళిపోయాడు. సావిత్రి నిట్టూర్చి ప్లేటుతీసి అవతల కడగ డానికి పడేసింది.

వెనక్కి తిరిగి అల్లా అట్లు వేయసాగింది. కొంచెం సేపటికి యిటుతిరిగి లలితను చూసేటప్పటికి ఆమె కన్నీళ్ళతో వదిన ముఖం చూడలేక లేవబోయింది. "ఆగు లలితా! నువ్విప్పుడు గదిలోకి వెళ్ళొద్దు, అతని నిప్పుడు ఏమీ బ్రతిమాలకు" అన్నది సావిత్రి. అయినా గానీ కళ్ళు తుడుచుకుంటూ లలిత లేచి వెళ్ళిపోయింది.

గదిలో మంచంమీద పడుకుని గోడవేపు ముఖం పెట్టుకుని వున్నాడతను. లలిత వచ్చిన అలికిడివిని లేచాడు. ఆమె తలుపు నానుకుని నిలబడింది. "ఏం వచ్చావు— అక్కడే కూర్చుని నువ్వూ, మీ అన్న పాపం.... పాపం రాంబాబు అని జాలిపడుతుండక పోయారూ?" నోరంతా తెరిచి, జుగుప్సంతా వెల్లడిస్తూ ఆపేరు పలికాడతను.

"రాంబాబు అంటే అంత యిదేమిటి నీకు? పాపం సుందరంగాడు అనుకోవేం? పరాయి మొగాడంటే ఎక్కడలేని ఆపేక్ష ఎల్లా ముంచుకొస్తుందీ?" కంఠం హెచ్చించకుండానే కటువుగా మాట్లాడుతున్నాడతను.

"ఊరికే మాటవరసకి నోరుజారి వచ్చిందామాట. దానికింత రాద్ధాంతం ఎందుకండీ?" కళ్ళనిండా నీళ్ళు ఆమెకి.

అతనులేచి దగ్గరకు వచ్చాడు. "ఈవేళ నోరుజారిందా? రేపు కాలూ జారుతుంది. అప్పుడూ రాద్ధాంతం చేయకుండా వుండడానికి నేనేమీ వాజమ్మనికాను. అందుకే నాకు నీతో ఏ తంటావద్దు నా దోవన నేను ఏలూరు ట్రాన్స్ఫరు

చేయించుకుంటున్నాను, నేను పోతాను. నువ్విక్కడే వుండు. పాపం రాంబాబుగారికి సౌకర్యాలు చూడు. ఇంకెవరెవరు వస్తారో వారందరి క్షేమం కనుక్కో. ఇస్త్రీ చీరెలు కట్టుకుని, చక్కగా ముస్తాబయి వీథులంట వూరేగు. కాలేజీ కోజు ల్పించీ అలవాటేగా?" బాగా దగ్గరగా నిలబడ్డాడు. భుజం పట్టుకుని కుదిపి "ఏం సరేనా? "నీ అనుమతి దేనికిలే నేను పోయేదేమాట" అన్నాడు.

"ఎందుకండీ అంతంతమాటలంటారు? నాకేం పనండీ అందరితో మాట్లాడ్డానికి! కాస్త చదువుకున్న దాన్ని కనుక వంటింటి కుందేలులాగ పడివుండలేక, అవసర మొచ్చినప్పుడు- ఎవరేనా పలకరిస్తే—మాట్లాడుతాను. మీ కొద్దంటే అదీ మానేస్తాను" లలిత మాట్లాడుతోంటే పళ్ళు బిగించి రెప్ప వేయకుండా చూస్తున్నాడతను.

"అదీ పాయింటు. నువ్వు చదువుకున్న దానివి- సంగీత సరస్వతివి. అందుకని సినిమాల్లోలాగ వెర్రివేషాలు కట్టి పాటలు పాడుకుంటూ తిరగొచ్చు. ఏం! ఈ కట్టుకున్నవాడు పల్లెటూరిబైతు కనుక అన్నీ సహించాలి" అతని చేయి భుజాన్ని నులిమేస్తోంది. లలిత పోటు భరించలేక ప్రక్కకి జరిగింది.

—గదిలో గందరగోళం బాగా ఎక్కువయింది. సావిత్రికి ఏమీ తోచడంలేదు. శ్రీపతి ఎటో వెళ్ళిపోయాడు. తలుపుకూడా వేసేశాడు సుందరం. లలిత ఏడుపు వినబడు

తోంది. అతను పెట్టే హింస తెలుస్తోంది. భడాలున తలుపు తెరుచుకుని లలిత యివతల పడింది. లేచి గబగబ పెరట్లోకి వెడుతోంది. వంటింటి దగ్గర వసారాలో కూర్చున్న సావిత్రి లలిత నడక, వాలకం చూసి హడలిపోయింది. జుట్టంతా పీక్కున్నట్లుంది. ఏదో అనుమానమొచ్చి, "లలితా!" అని పిలిచింది. ఐనా వినిపించుకోక లలిత పరుగెత్తింది. సావిత్రి వెనకే వెళ్ళి నూతివరకు వెళ్ళిన ఆమెను గట్టిగా పట్టుకుంది. వాలేసుకుని, ఆమె పెనుగులాడుతున్నా పట్టించుకోక లాక్కొచ్చింది. వసారాలో కూలవేసింది.

చాలసేపు యిద్దరూ మాట్లాడలేదు. సొమ్మసిల్లిన లలిత వదిన వళ్ళో పడుకుంది. ఆమె జుట్టు సవరించి కన్నీళ్ళు తుడిస్తే బుగ్గలమీద కనబడ్డ ఎర్రటి వేళ్ళ గుర్తులని చూసి సావిత్రికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎనిమిదేళ్ళుగా తను బిడ్డగా పెంచుకున్న లలిత స్థితిచూసి ఆమె కడుపులో కలచి వేసినట్లయింది.

ఇంత ఘోరంగా వున్నది పరిస్థితి. మామగారికి చెప్పించాలి. సుందరానికి ఏలూరు ట్రాన్సఫరు సంగతి చూడమనాలి. అతను వెడితేనైనా నాలుగు నెలలపాటు సుఖంగా వుంటుంది. తనకి లేనిపోని అప్రదిష్ట యింట్లో వుండికూడా చూసిందికాదని. ఈ గొడవల్లో లలిత ఏదైనా అఘాయిత్యం చేసిందంటే ఆజన్మాంతం బాధపడాలి. నూతిలో దూకుదామని ఆవేశంతో పరుగెత్తుకొచ్చింది. ఏమీలేకపోయినప్పటికీ,

కూనిరాగం తీసిందనో, ఎక్కడికో వెళ్ళిందనో, ఏదో ఒక కారణం కనిపెట్టి వారాని కొకసారైనా గొడవపెట్టుకుంటాడతను. లలిత నవ్వుతూ కనబడటమే అరుదు. నవ్విందో, వెంటనే ఏదో తప్పుచేసినట్లు బిక్కగా ముఖం పెట్టుకుంటుంది. బెదిరే కళ్ళతో అతన్ని చూస్తుంది. అంతే నవ్వు తుడిచినట్లు మాయమైపోతుంది. కళ్ళల్లో లోతు ఎక్కువైపోతుంది.

లలిత అల్లాగే పడుకుంది. సావిత్రి చేత్తో ఆమె వళ్ళు నిమురుతోంటే కాంతిలేని కళ్ళతో జామచెట్టు వైపు, ఆకుల మధ్యనుంచి కనబడే ఆకాశం వేపు చూస్తోంది.

✥ ✥ ✥ ✥

"ఏమమ్మా, యిల్లా కూర్చున్నావు? అన్నం తినలేదా?" అనడిగాడు వీర్రాజు కూతుర్ని. రాత్రి పదిగంటలవుతోంది. పడక్కుర్చీలో జారగిలబడి కూర్చుంది లలిత ఏమీ తోచనట్లు. సుందరం యింకా యింటికి రాలేదు. నెలదాటింది అతను ట్రాన్స్ఫరయి వెళ్ళి. ఏలూరు నుంచి పండుగ సెలవులు నాలుగురోజులూ వచ్చాడు అత్తవారింటికి. వచ్చిన తర్వాత రెండురోజులు బాగానే వున్నారు. ఈవాళ సాయంత్రం సినిమాకి వెళదామని కాబోలు ప్రయాణమైనారు. అంతలో ఏమొచ్చిందో లలిత ఉండిపోయింది. అతను వెళ్ళిపోయాడు. ఏడున్నరకి కోడలు ఫలహారం పెడితే

తిన్నాడు వీర్రాజు. భార్య పోయాక ఆయన రాత్రిళ్ళు అన్నం మానేశాడు. సావిత్రి పాపం రోజూ ఏదో ఒకటి వోపికగా చేస్తుంది. తను చేసేది ఫలహారం కావడంవలన, ఎవరెప్పుడు భోజనం చేస్తారో పట్టించుకోదు. కానీ లలితను మాత్రం వో కంట కనిపెడుతుండవలసిన అవసరం పెళ్ళయ్యాక కలిగింది. రెండు నెలలనాడు శ్రీపతి ఎంతో నొచ్చుకుంటూ చెప్పాడు ఆ వేళ జరిగిన గందరగోళం. సుందరానికి ఏలూరికి ట్రాన్సఫరైంది. తను బెదిరింపుగా లలితతో అన్న మాట నిజమైంది. అతను వెళ్ళాడు ట్రాన్సఫరు ఎల్లాగైందో తెలియక.

తనూ మనిషినే అన్నట్లు పాపం నవ్వుతూ తిరుగుతున్న కూతుర్ని చూచి వీర్రాజు విషయాలన్నీ చక్కబడ్డాయనుకున్నాడు. కానీ సినిమా ముందే పేచీ వచ్చింది. అతను సినిమాకి వెళ్ళిపోయినట్లున్నాడు. ఆమె గదిలో ఎంతోసేపుండి చివరికి బయటికి వచ్చి పడక్కుర్చీలో కూర్చుంది. చీరైనా మార్చుకోలేదు. వీర్రాజు పలకరించేటప్పటికి ఆమె ఉలిక్కిపడింది. "లేదు నాన్నా! ఏం లేదు, తింటాను" అన్నది. వదిన తనని ఎంతోసేపు బ్రతిమాలి మేడమీదకి వెళ్ళిందని ఏమి చెబుతుంది?

"వదిన భోంచేసిందా?" అన్నాడాయన. కోడలు యీమెను అడుగకుండా వెళ్ళదని ధైర్యమే. కానీ యిల్లా అడిగాడాయన సూటిగా కాక.

"ఏమో నాన్నా, తెలియదు" అని లేచిందామె. ఎదురుగా వుంటే ఏమి అడుగుతాడోనని గదిలోకి వెళ్ళింది. ఆయనకూడా లోపలికి వెళ్ళాడు. మళ్ళీ బయటికి వచ్చి వీధి గుమ్మం దగ్గర నిలబడి అటుయిటు చూస్తోంది.

"పిచ్చి తల్లి కాకపోతే, ఆ కొయ్యమనిషి ఎప్పుడొస్తే తన కెందుకు? అంత కళ్ళల్లో వత్తులు వేసుకుని చూసేందుకు ఏముంది?" అనుకున్నాడు వీర్రాజు గుమ్మం ఎదురుగా మంచం మీద పడుకుని.

ఇంతలోనే వీధిలో చెప్పుల చప్పుడవటం సుందరం రావడం జరిగింది. వస్తూనే, "ఏం?....ఇంత ముస్తాబుతో వీధిలో నిలబడ్డావు? నీకు సంసారి లక్షణాలు ఎప్పుడొస్తాయే?" అంటూ ఆమెను త్రోసుకుని లోపలికి వచ్చాడు. మామ గారిని చూశాడు. తన మాటలు విన్నాడేమో నన్న బెరుకు ఒక్క క్షణం వచ్చింది లోపలికి. కానీ వెనక్కి తిరిగి, "పద లోపలికి" అన్నాడు సాధ్యమైనంత మృదువుగా.

కళ్ళెత్తి తండ్రిని చూడలేక చిన్నబోయిన ముఖాన్ని దాచుకోలేక అడుగులు వేసింది లలిత. పెళ్ళికూతురులాగ అలంకరించుకున్న ఆమె, నిండా పూలుపూచి, వాడిపోయిన లతలా వుంది. వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళేదాక అల్లాగే నిలబడ్డాడు వీర్రాజు. "అమ్మాయి ఏమీ తినలేదు సుందరం!" అని చెబుదామని గొంతు ఎత్తబోయి వూరుకున్నాడతను, దానికి ఏమి కసురుతాడో ఆమెమీద అని తోచి.

వీధిగుమ్మం దాటి అరుగుమీదకి వచ్చి నిలబడ్డాడు. వీధంతా వెన్నెల. ఎక్కడా అలికిడిలేదు. రాంబాబు కూడా నిద్రపోయాడో రెండో ఆట సినిమాకి వెళ్ళాడో గదిలో దీపం లేదు.

ఇల్లాంటి ఒక రాత్రివేళ ముప్ఫయిరెండు సంవత్సరాల క్రితం ఈ అరుగుమీద తను ఏమి చేశాడు? పాపం, కాంతం ఏ లోకంలో వుందో ఆ రాత్రి తను ఆమెను ఈ అరుగు మీదకు తీసుకువచ్చి వళ్ళు పచ్చడి అయ్యేలాగ దెబ్బలు కొట్టాడు. ఇంట్లో ఎవరికీ వినబడకుండా తలుపు వేశాడు. వీధిలో కుక్కలు మినహా మరో ప్రాణి సంచారం లేని సమయంలో రాత్రి ఒంటిగంటకి తను చేసిన ఘనకార్యం అది. పైకి సవ్వడి వినబడకుండా ఏడిచి, బ్రతిమాలి, కాళ్ళమీద పడి, వీధిలో మసలే ఆ కుక్కలవంటి ప్రాణిలాగ ప్రవర్తించింది కాంతం. నేను మనిషిని నాకు స్వాతంత్ర్యం వుంది అని ఎదురు తిరగలేదు.

ఆమె చేసిన తప్పు? ఆమె మేనత్త కొడుకు వస్తే, అతనికి పరిచర్యలు చేస్తూ వుండిపోయింది. చిన్ననాటి కబుర్లు ఏవో చెబుతోంటే హాయిగా నవ్వింది. ఇద్దరూ సరదాగా మాట్లాడుకున్నారు. అతనికీ పెళ్ళయింది. అయితే చిన్నప్పుడు అందరి యిళ్ళలోలాగ ముసిలాళ్ళు "కాంతం నీ పెళ్ళాంరా" అన్నారు. కాంతానికి సంబంధం చూసి వీర్రాజుతో పెళ్ళయే దాక యిద్దరూ ఆపేక్షగా ఒకరితో నొకరు మసిలారు. అది

మసిపిశి మనిషికి వుండే ఆప్యాయతేగానీ, ప్రేమికుల అనుబంధంకాదు, అదంతా ముక్కుపచ్చలారని పసితనంలో. అయినా వీర్రాజుకి సంబంధించినంతవరకు అతను కాంతానికి తప్పిపోయిన మొగుడే. ఏమూలో ఆమె మనస్సులో అతనికి చోటుంది. అందుకే ఎర్రని పెదిమలు విప్పి, మెరిసే పలువరస కనబడేలాగున నవ్వుతుంది. విశాలమైన కళ్ళు ముడుచుకుని పోయేలాగు నవ్వుతుంది. నునుపైన బుగ్గలమీద దీపంకాంతులు పడి మెరిసేలాగు నవ్వుతుంది.

అదంతా భరించలేక, తను పిలిచినా వినిపించుకోలేదనే కోపంతో, ఆరోజు ముప్ఫై రెండు సంవత్సరాల క్రితం తన పౌరుషం చూపించుకున్నాడు తను. భార్యమీద తనకుగల సర్వహక్కులనీ ఋజువు చేసుకున్నాడు. మర్నాడు ప్రొద్దున్న ఆమె ఎవరికీ ముఖం చూపలేదు. జ్వరమని ముసుగుపెట్టుకుని పడుకుంది. ఐనా ప్రొద్దు ఎక్కాక పళ్ళు తోముకుంటుంటే సూర్యనారాయణ వోరకంటితో ఆమెను చూడటం తను చూడలేదా? ఆమె తల భూమిలోకి వంచుకుని అభిమానంతో క్రుంగిపోవడం తను చూడలేదా? అయితేనేం, తను విజయమే సాధించాడు. ఆమెకి కలిగిన అవమానం తనకి చీమకాటులాగనైనా లేదు.

ఏడేళ్ళ క్రితం చచ్చిపోయిన కాంతం ఎక్కడుందో! తను తల్లిలేని బిడ్డగా వదలిపోతున్న లలితకి ఒకనాడు వయస్సువస్తుందని, పెళ్ళవుతుందని ఆమె అనుకున్నది. వీర్రాజూ

అనుకున్నాడు. లక్షణమైన ఉద్యోగం చేస్తున్నవాడు సుందరం. దూరపు బంధువుల అబ్బాయి అందమైన సుందరం. ఎంతో మురుస్తూ, శ్రీపతికి తోడుగా కృష్ణార్జునులుగా వుంటారనుకుని తెచ్చుకున్న అల్లుడు. ఉన్న వూళ్ళోకి బదిలీ చేయించుకుని తెచ్చుకున్నాడు.

బి. యస్. సి. ప్యాసైంది లలిత. బంతిపూవులాగ యింట్లో గంతులేసింది చిన్నప్పుడు. కాలేజీ చదువు ప్రారంభించేసరికి నాజూకుదేరి అందంగా తీగెలా సాగింది. ఇల్లంతా తనేగా సందడంతా తనదేగా, తండ్రికి వున్న సర్వస్వం తన ప్రేమానురాగాలే అన్నట్లుగా మసలింది. చివరకు ఆమెకు దొరికిన సుందరం తగని అనుమానస్తుడు. కోమలత్వమంతా శరీరంలోనే గానీ మనస్సులో కాదు, మాటలో అసలే లేదు. ఎప్పుడైనా భార్యని లాలిస్తాడా అనిపిస్తుంది. ఎన్నడైనా ఆమె ముఖాన నవ్వుదీపాలు వెలిగిస్తాడా అనిపిస్తుంది.

సుందరం అనుమానస్తుడు- అనుకున్న వీర్రాజు కళ్ళు చెమర్చాయి. తనూ అనుమానస్తుడే. కాంతం ఎవరివంక చూసినా, ఎవరితో మాట్లాడినా, క్షణం తనని ఏమరినా సహించలేని, భయంకరమైన అనుమానంతో బాధపడ్డాడు, బాధపెట్టాడు. ఇప్పుడు అనుకుని ఏం లాభం? పాపం- లలిత- వడగాడ్పు తాకిన తీగెలా వాడిపోయింది. పువ్వులాగా పూచిన నవ్వులన్నీ గబగబ మొగ్గలతో సహా త్రుంచేసి అవతల పారబోసి చిచ్చు పెట్టేశాడు సుందరం. కాంతం బ్రతుకులోని

నవ్వులుతను అప్పుడప్పుడు నాశనంచేసినప్పుడు? అప్పుడు తనకి అర్థంకాని బాధ ఏదో యిప్పుడు అర్థమౌతోంది.

పోనీ అతనికి చెబితేనో? "నా బిడ్డ బంగారుతల్లి, అనుమానాలతో దాని బ్రతుకు పాడుచేయకు నాయనా!" అని చెబితేనో!

లోపలికి వచ్చాడు వీర్రాజు. సుందరం బట్టలు మార్చుకుని గదిలోంచి యివతలికి వచ్చాడు. "సుందరం మాట" అన్నాడు. అల్లా పిలుస్తూనే కళ్ళు వప్పగించి చూశాడు గది వేపు. సుందరం వెనక్కి తిరిగి, గది గుమ్మం దగ్గర నిలబడ్డ లలితని జడ పుచ్చుకుని మెల్లిగా లాగుతూ "రావూ మరి, అన్నం తిందాం" అంటున్నాడు.

గారాబంగా, గోముగా "వూహూ, నేను రాను" అంటోంది లలిత. తెరచిన నోరు మరుక్షణం మూసేశాడు వీర్రాజు. మళ్ళీ సుందరాన్ని పిలవకుండానే వీధి తలుపులోంచి అరుగుమీదకి వెళ్ళి కూర్చున్నాడు. చీకటిగా వున్న అరుగు మీద కూర్చున్నాడు అతను కూర్చున్నదిచీకట్లోనే. కానీ వెన్నెల్లోకి, తెల్లగా, స్వచ్ఛంగా, ఎంతో చల్లగా లోకమంతటినీ స్పృశిస్తున్న వెన్నెల్లోకి చూస్తున్నాడతను. మబ్బు వచ్చి కాబోలు ఒకసారి నీడగా కనబడింది వెన్నెల. అది కూడా ఒక్కసారే. ఆ తర్వాత మళ్ళీ అందమైన వెన్నెలే.